

మాట్లాడుతున్న శంకర్‌నాయక్

విద్యార్థులు ఉన్నత శిఖరాలను
అధిరోహించాలి

- జిల్లా ఇంటర్ విద్యాధికారి శంకర్‌నాయక్

దోమ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం ఆయన దోమ ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. రానున్న వార్షిక పరీక్షలపై విద్యార్థులకు దిశ నిర్దేశం చేశారు. విద్యార్థులు పట్టుదలతో, క్రమశిక్షణతో చదువుతూ తల్లిదండ్రుల ఆశయ సాధన కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రూపలక్ష్మి, అధ్యాపకులు రాధా, రాములు, లక్ష్మయ్య, సునీత, మధుసూదన్, శ్రీధర్ కుమార్, సువర్ణ, సానియా సుల్తానా, శ్రీకాంత్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బందెయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు

జిల్లా	ప్రాంతం	ఉష్ణోగ్రత (డిగ్రీల్లో)
వికారాబాద్	మర్పల్లి	12.6
రంగారెడ్డి	మంగల్‌పల్లి	13.1
మేడ్చల్	ఘట్‌కేసర్	13.9




ప్రభువు శిలువ వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న భక్తులు

తరలివస్తున్న భక్తజనం

- మెథడిస్టు జాతరలో కర్ణాటక ఎమ్మెల్యే ప్రార్థనలు

ధారూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ధారూరు మెథడిస్టు జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. రెండో రోజు బుధవారం కర్ణాటక రాష్ట్రం, యాద్గిర్ నియోజకవర్గ ఎమ్మెల్యే చరణ్ గౌడ్ ప్రభువును దర్శించుకున్నారు. అనంతరం అక్కడికి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. కాగా, ఆ ప్రాంగణంలో వివిధ రకాల వ్యాపార దుకాణాలు వెలిశాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు కిరాణ, పిల్లల ఆట సామగ్రి, శీతల పానియాలు, మాంసహార హోటళ్లు, ప్లాస్టిక్ బిందెలు, మట్టి కుండలు, బట్టలు, స్వెటర్లు, బొంగులు, పుట్నాలు, బరానీలు, చాయ్ దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. కాగా జాతరకు వచ్చిన భక్తులు ప్రధాన వేదికపై ఉన్న ఏసుప్రభువు శిలువ వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శుక్రవారం నుంచి భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉంది. కర్ణాటకలోని బీదర్, గుల్బార్గా, చించోలి, కుంచారం తదితర ప్రాంతాలతో పాటు జహీరాబాద్, మెదక్, సంగారెడ్డి తదితర ప్రాంతాల నుంచి పాదయాత్ర ద్వారా భక్తులు మెథడిస్టు చర్చికి చేరుకుంటారు. శనివారం, ఆదివారాల్లో భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం



వికారాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : 2025-26 సంవత్సరానికిగాను ప్రభుత్వ పాఠశాలల్లోని 9, 10 వ తరగతి బీసీ, ఈబీసీ విద్యార్థులు.. ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ అధికారి మాధవరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత విద్యార్థులు ఈ-పాస్ వెబ్‌సైట్‌లో తమ పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.



- ఉమ్మడి జిల్లాలో 'లక్కీ' భాస్కర్లకు కాసుల వర్షం (గుడ్‌విల్)
- ఒక్కో దుకాణానికి రూ.50 లక్షల నుంచి రూ.2.50కోట్ల వరకు ఆఫర్
- డ్రాలో మద్యం దుకాణాలు పొందిన వారికి సిండికేట్ వ్యాపారుల ఎర
- నగర శివార్లలో భారీ డిమాండ్
- సరూర్‌నగర్ ప్రాంతంలో రూ.2.60 కోట్ల గుడ్‌విల్ ఇచ్చిన అధికార పార్టీ నేత

రాయబేరాలు!

కాసుల వర్షం కురిపించే మద్యం దుకాణాలకు ఉమ్మడి జిల్లాలో భారీ డిమాండ్ పెరిగింది. రెండేళ్లకోసారి దరఖాస్తులు స్వీకరించి లక్కీడ్రా ద్వారా కేటాయించే ఈ షాపులను దక్కించుకోవడానికి వ్యాపారులు పోటీ పడుతుంటారు. ఇటీవల నిర్వహించిన డ్రాలో పలువురు వ్యాపారులను అదృష్టం వరించగా.. మరికొందరికి నిరాశే మిగిలింది. అయితే మద్యం దుకాణాలు దక్కనివారు లక్కీ భాస్కర్లకు ఎర వేస్తున్నారు. కోట్ల రూపాయల గుడ్‌విల్‌ను ఆఫర్ చేస్తూ మద్యం షాపులను దక్కించుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే చాలా దుకాణాలు ఇలానే చేతులు మారాయి. సిండికేట్లు మరిన్ని షాపులను దక్కించుకునేందుకు ముమ్మరంగా బేరసారాలు కొనసాగిస్తున్నారు.

చేతులు మారుతున్న మద్యం షాప్‌లు



వికారాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లాటరీ ద్వారా కేటాయించిన మద్యం దుకాణాలు పెద్ద సంఖ్యలో చేతులు మారుతున్నాయి. కొత్త ఎక్సైజ్ సంవత్సరానికి సంబంధించి ఇంకా మద్యం వ్యాపారం ప్రారంభించక ముందే డ్రాలో మద్యం దుకాణాలు దక్కించుకున్న లక్కీ భాస్కర్‌లకు కాసుల వర్షం కురుస్తోంది. డ్రాలో మద్యం దుకాణాలు దక్కని సిండికేట్లు 'లక్కీ'ల నుంచి మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు బేరసారాలు కొనసాగిస్తున్నారు. ఈ అదృష్టవంతుల ఇళ్లకు సిండికేట్లు వచ్చి వారి గుమ్మాల ముందు రూ. కోట్లు కుమ్మరిస్తున్నారు. నగర శివార్లలో సిండికేట్లు భారీగా ఆఫర్లు ఇస్తున్నారు. ఇప్పటికే ఆదాయం వచ్చే కొన్ని కీలక ప్రాంతాల్లో సిండికేట్లు షాపులను అధిక ధరలు చెల్లించి కైవసం చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో రూ.50 లక్షల నుంచి రూ.2.50కోట్లకు పైగా గుడ్‌విల్ ఆఫర్ ఇస్తున్నారు. సరూర్‌నగర్ డివిజన్‌లో కొన్నాళ్లుగా మద్యం వ్యాపారం నడుపుతున్న అధికార పార్టీ నేత ఒకరు తనకు డ్రాలో మద్యం షాపు రాలేదు. దీంతో ఆయన డ్రాలో షాపు వచ్చిన వారికి రూ.2.60 కోట్లు గుడ్‌విల్ ఇచ్చి దాన్ని సొంతం చేసుకున్నారు. అలాగే ఇదే ప్రాంతానికి చెందిన మరో వ్యాపారి

మిగతా 7వ పేజీలో...



రెచ్చిపోయిన రియల్ వ్యాపారులు
7

ఎన్‌ఎఫ్‌సీ నగర్‌లో
ఇష్టారాజ్యంగా బస్టాండ్ కూల్చివేత
చర్యలకు కాలనీవాసుల డిమాండ్



అక్రమ తవ్వకాలపై విజిలెన్స్ తనిఖీలు
7

లోకాయుక్తకు నివేదిక అందజేత

కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు ఉండొద్దు

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

బొంరాస్‌పేట్/వికారాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. బుధవారం బొంరాస్‌పేట్ మండలంలోని కొత్తూర్, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరను అందిస్తూ ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాల్‌కు రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 చొప్పున మద్దతు ధర కల్పిస్తుందన్నారు. దీంతో పాటు సన్నాలు క్వింటాల్‌కు బోనస్ రూ.500 చొప్పు ఇవ్వడం జరుగుతుందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సదుపాయాలు కల్పించడంతో పాటు గన్నీ బ్యాగులు, తూకం యంత్రాలు, టార్పాలిన్‌లు, తేమ కొలిచే యంత్రాలను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అనంతరం నాగిరెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించిన ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, అడిషనల్ డీఆర్‌డీవో నర్సిములు, డీసీఎవో సుదర్శన్, డీఎంసీఎస్ మోహన్ కృష్ణ, తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీవో వెంకన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అనంతుడి సేవలో కలెక్టర్

అనంతగిరి శ్రీ అనంతపద్మనాభ స్వామిని కలెక్టర్ ప్రతీక్ జైన్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయానికి వెళ్లిన కలెక్టర్‌కు ఆలయ వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం కలెక్టర్‌కు తీర్థ ప్రసాదాలతో పాటు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, డీఆర్‌వో మంగీలాల్, ఆర్‌డీవో వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఆలయ ఈఓ. నరేందర్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మను చౌదరి, ఇతర అధికారులు

వృద్ధుల ఆరోగ్యంపై అవగాహన

- మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో వృద్ధుల అవగాహన, వారిని చైతన్య పరిచేందుకు వారం పాటు నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమాల పోస్టర్‌ను బుధవారం కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ రాధికా గుప్తా ఆవిష్కరించారు. దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్స్ సాధికారిత శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమ పోస్టర్‌ను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. జిల్లాలో నేటి నుంచి 19 వరకు వారం రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వృద్ధుల ఆరోగ్యం, భద్రత, సామాజిక భాగస్వామ్యం, శ్రేయస్సు పెంపుదలకై అవగాహన కార్యక్రమాలు, చర్చా వేదికలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారత, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యనిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు
లేక అవస్థలు

- బీజేపీ రాష్ట్ర నాయకుడు సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రుల్లో కుక్కకాటు నివారణకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన ఘట్‌కేసర్ ప్రభుత్వాసుత్రికి వెళ్లి యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌పై వైద్యాధికారులను, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్కకాటు వ్యాక్సిన్ కోసం వచ్చే బాధితులను నగరంలోని నారాయణగూడ ప్రభుత్వాసుపత్రికి పంపుతున్నారని మండిపడ్డారు. 120 బాక్సులు కావాలని ఇండెంట్ పెడితే కేవలం 10 బక్సులు పంపి ప్రభుత్వం చేతులు దులుపుకున్నదని ఆయన ఆరోపించారు. ప్రభుత్వాసుపత్రులకు మందులను అందించకుండా కావాలనే రోగులను ఇబ్బంది పెడుతూ ప్రైవేట్ ఆసుపత్రులకు మళ్లించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే అవసరమైన మందులను ఆస్పత్రులకు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

70గ్రామాల్లో
సర్వేకు ఓకే



జిల్లాలో భూధార్ కేటాయింపునకు ఏర్పాట్లు

- రైతుకు ఉన్న అన్ని భూములకు ఒకే నంబర్
- సర్వేయర్లను సిద్ధం చేసిన అధికారులు

మేడ్చల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో రైతుల భూములకు భూధార్ నంబర్ కేటాయించేందుకు సర్వే కోసం అధికారులు 70 గ్రామాలను ఎంపిక చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఒక్కో రెవెన్యూ గ్రామంలో రైతుకున్న వివిధ సర్వే నంబర్లలోని భూములన్నింటిని ఒకే దగ్గర పొందుపరచి భూధార్ నంబర్‌ను కేటాయించనున్నారు. ఇందుకోసం రైతు సాగు భూములన్నింటిని సర్వే చేసి రైతు భూమి భాగాలను, వివరాలతో పాటు పూర్తి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందపరుస్తారు. భూ భారతి చట్టం అమలులో

మిగతా 8వ పేజీలో...

మండలానికి ఇద్దరు సర్వేయర్లు



భూధార్ నంబర్ కేటాయింపు కోసం సర్వే చేయడానికి మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. మండలానికి ఇద్దరు సర్వేయర్ల చొప్పున లైసెన్స్‌డ్ సర్వేయర్లను సర్వే కోసం సిద్ధం చేశాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే సర్వే ప్రారంభిస్తాము.

-విజయేందర్‌రెడ్డి,
అదనపు కలెక్టర్, మేడ్చల్

త్వరలో ఆధునికీకరణ పనులు పూర్తి

- సౌత్ సెంట్రల్ రైల్వే డీఆర్ఎం గోపాలకృష్ణన్


ఆధునికీకరణ పనులను పరిశీలిస్తున్న డీఆర్ఎం

తాండూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తాండూరు నుంచి కర్ణాటక రాష్ట్రం వాడి వరకు జరుగుతున్న రైల్వే ఆధునికీకరణ పనులు త్వరలో పూర్తి కానున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే డీఆర్ఎం గోపాలకృష్ణన్ తెలిపారు. ఆయన బుధవారం తాండూరు రైల్వే స్టేషన్‌లో ప్రతీ విభాగంలో జరుగుతున్న పనులను పరిశీలించి ఇంజనీరింగ్ విభాగం అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాత తాండూరు రైల్వే వంతెన వద్ద జరుగుతున్న పనులను సైతం పరిశీలించారు. అమృత్ భారత్ కింద రూ24 కోట్లతో చేపడుతున్న పనులను అధికారులు మ్యాప్ ద్వారా డీఆర్ఎంకు వివరించారు. విద్యుత్ రైళ్ల రాకపోకలు జరిగే పట్టాలపై యంత్రాలు ఏర్పాటు చేసి పరిశీలించారు. ప్రత్యేక రైల్లో తాండూరుకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ వచ్చే నెలలో రైల్వే ఎంట్రెన్స్ భవనం ప్రారంభిస్తామన్నారు. అలాగే వచ్చే యేడాది మార్చి నాటికి ఆధునికీకరణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. రైళ్ల కోసం డీఆర్ఎంకు జనసత్తా వెల్ఫేర్ కమిటీ ప్రత్యేకంగా విన్నవించారు.

కాచిగూడ నుంచి వాడి వెళ్తున్న ప్యాసింజర్‌ను గుల్బర్గా వరకు పొడిగించాలని, రాయిచూర్ పర్భాని ఎక్స్‌ప్రెస్‌కు జనరల్ బోగిని ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే హైదరాబాద్ - సోలాపూర్ ఇంటర్ సిటీ రైలును, హైదరాబాద్ - తాండూరు లోకల్ రైలును పునరుద్ధరించాలని తాండూరు పట్టణ జనసత్తా వెల్ఫేర్ కన్వీనర్ అప్సర్ విన్నవించారు.

మా అన్న.. ఎప్పుడొస్తడు?

కన్నీటి పర్యంతమవుతున్న విద్యార్థి వంశీ చెల్లెలు అశ్విని
స్కూల్‌లో మూడో తరగతి విద్యార్థికి విద్యుత్ షాక్


అశ్వినిని ఓదారుస్తున్న మరో విద్యార్థి తల్లి మృదుల

వికారాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గంగారం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ట్రాన్స్‌ఫార్మర్ తగిలి కరెంట్ షాక్‌తో గాయాల పాలైన తన అన్న వంశీ కోసం అతడి చెల్లెలు అశ్విని తల్లడిల్లిపోతోంది. ఆసుపత్రికి పోయిన అతడు ఎట్లున్నడు.. ఎప్పుడొస్తాడంటూ కన్నీరుమున్నీరవుతోంది. విద్యుత్ షాక్‌కు గురైన వంశీ గంగారం ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతుండగా, అతడి చెల్లెలు అశ్విని రెండో తరగతి చదువుతోంది. చిన్నతనంలోనే వారు తల్లిదండ్రులను కోల్పోవడంతో వారి ఆలనాపాలనా బాబాయ్, నాయనమ్మ చూస్తున్నారు. చదువుల్లో అన్నా చెల్లెలు ఎప్పుడూ

మిగతా 8వ పేజీలో...

పీఎంశ్రీ నిధుల వివరాలు వెల్లడించాలి

మహేశ్వరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు పరుస్తున్న ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) నిధుల వివరాలను వివరించాలని రంగారెడ్డి జిల్లా దిశ కమిటీ సభ్యుడు అంబోజి శ్రీనివాస్ అన్నారు. ఈమేరకు బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు విద్యాధికారి పూర్ణచంద్రరావును కలిపి నిధుల వివరాలు ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. ఏయే పనులకు నిధులు వినియోగిస్తున్నారన్న వివరాలు వెల్లడించాలన్నారు.

అవినీతి అధికారులను ప్రభుత్వం ఉపేక్షించదు

పనుల కోసం లబ్ధిదారులు లంచాలివ్వొద్దు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడే అధికారులు, ఉద్యోగులను ప్రభుత్వం ఉపేక్షించబోదని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హెచ్చరించారు. పనులు త్వరగా కావాలని లబ్ధిదారులు అధికారులు, సిబ్బందికి లంచాలు ఇచ్చి వారిని అవినీతిపరులుగా మార్చొద్దన్నారు. ఆమనగల్లు పట్టణంలోని కల్యాణిగార్డెన్‌లో బుధవారం 76 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, కొత్తగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన 48 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఏఎంసీ చైర్‌పర్సన్ గీతా నర్సింహ, వైస్‌చైర్మన్



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

భాస్కర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీపాతిశ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి కసిరెడ్డి పంపిణీ చేశారు. అనంతరం తహసీల్దార్ మహ్మద్ ఫయామ్ ఖాద్రీ, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, ఎంపీడీవో మాధురిలతో కలిసి నిర్మాణాలు పూర్తైన పలువురు లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ . పనిచేయని, అక్రమాలకు పాల్పడే అధికారులు, సిబ్బంది ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని అన్నారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ శాలినీ, మున్సిపల్ మేనేజర్ ఆంజనేయులు, యాట నర్సింహ, జగన్, మానయ్య, మిట్టపల్లి అంజయ్య, కానుగుల దశరథం, ఖాదర్‌ఖాద్రి, తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

రాయ'బేరాలు'!

(ఐదో పేజీ తరువాయి)

కూడా రూ. 2.20 కోట్లు వెచ్చించి షాపు తీసుకున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున మద్యం షాపులు వ్యాపారం ప్రారంభానికి ముందు చేతులు మారుతున్నాయి. ఈసారి మద్యం దుకాణాల కోసం ఒకటి, రెండు దరఖాస్తులు దాఖలు చేసిన వారికి ఎక్కువగా లక్కీ డ్రాలో అదృష్టం వరించింది. పదుల నుంచి వందల సంఖ్యలో దరఖాస్తు చేసిన వారి కంటే ... వస్తే మద్యం దుకాణం, పోతే రూ. 3 లక్షలు అనుకుని దరఖాస్తు చేసుకున్న వారినే ఈసారి ఎక్కువగా లక్కీ డ్రాలో అదృష్టం వరించింది. మద్యం వ్యాపారంతో సంబంధం లేకుండా కొత్తగా దరఖాస్తు చేసుకుని అదృష్టం కలిసి వచ్చిన వారికి గుడ్ విల్ ఎరచూపి వారికి డ్రాలో వచ్చిన మద్యం దుకాణాలను సొంతం చేసుకునేందుకు సిండికేట్, మద్యం వ్యాపారులు తమ ప్రయత్నాలను తీవ్రతరం చేశారు. చాలా కాలంగా మద్యం వ్యాపారంలో కొనసాగుతున్న కొందరు సిండికేట్‌గా మారి... డ్రాలో మద్యం దుకాణాలు వచ్చిన వారికి గుడ్‌విల్ ఆఫర్ చేస్తున్నారు. మద్యం వ్యాపారుల సిండికేట్ల గుడ్‌విల్‌కు కొందరు మొగ్గు చూపితే.. మరికొందరు తామే మద్యం దుకాణాలను నడిపించుకుంటామని స్పష్టం చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఇలాంటి వారి నుంచి కూడా మద్యం దుకాణాలను సొంతం చేసుకునేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం కొనసాగుతున్న మద్యం దుకాణాల కాల పరిమితి ఈనెల 30వ తేదీతో ముగియనుంది. 2025-27 సంవత్సరాలకు సంబంధించి మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్న వారిలో డ్రాలో ఎంపికైన వారికి డిసెంబరు ఒకటో తేదీ నుంచి మద్యం దుకాణాలు నిర్వహించేందుకు అనుమతులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకుని డ్రాలో భంగపడ్డ వ్యాపారులు మద్యం దుకాణాలను చేజిక్కించుకునేందుకు సిండికేట్ల రూపంలో తీవ్ర



ప్రయత్నాలు చేస్తున్నారు.

దరఖాస్తులకు ముందే సిండికేట్

ఉమ్మడి జిల్లాలో 514 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఇందులో రంగారెడ్డిజిల్లాలో 249, మేడ్చల్ జిల్లాలో 206, వికారాబాద్‌లో 59 మద్యం షాపులు ఉన్నాయి. వీటికి 28వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. అయితే ముందుగానే మద్యం వ్యాపారులు సిండికేట్ కావడంతో ఈ సారి గతంలో కంటే 10వేల దరఖాస్తులు తక్కువ వచ్చాయి. దీనివల్ల కూడా ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లింది. గతనెల 27న నిర్వహించిన మద్యం దుకాణాల కేటాయింపు డ్రాలో సిండికేట్లలో కొందరికే అదృష్టం కలిసి వచ్చింది. ప్రస్తుతం మద్యం వ్యాపారంలో కొనసాగుతున్న వారితో పాటు కొత్త వారు కూడా ఎక్కువ సంఖ్యలో ఈసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. అయితే మద్యం వ్యాపారంలోకి కొత్తగా అడుగు పెట్టిన పలువురికి డ్రాలో అదృష్టం కలిసి వచ్చింది. ఒక దరఖాస్తు మాత్రమే దాఖలు చేసిన వికారాబాద్ జిల్లాలో ఆరుగురు మద్యం దుకాణాలు దక్కించుకున్నారు. రెండు నుంచి అయిదు లోపు దరఖాస్తు చేసుకున్న వారిలో ఏడుగురిని అదృష్టం వరించింది. జిల్లాలో మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకున్న ఇతర జిల్లాలకు చెందిన పది మంది డ్రాలో ఎంపిక కాగా, జిల్లాలో ఒకరికే వేర్వేరు చోట్ల రెండు మద్యం దుకాణాలు దక్కిన ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. గతంలో మాదిరిగా ఈసారి సిండికేట్లకు ఎక్కువ దుకాణాలు దక్కలేదు. సిండికేట్‌గా ఏర్పాటై ఎక్కువ సంఖ్యలో దరఖాస్తు చేసినా డ్రాలో భంగపాటే ఎదురైంది. మద్యం వ్యాపారాన్ని ఓ స్టేటస్‌గా భావిస్తున్న వారు ఇందులో కొత్తగా దిగి దుకాణాలు దక్కించుకున్న వారికి గుడ్‌విల్ రూపంలో ఆశ చూపి వైన్ షాపులను దక్కించుకునేందుకు తీవ్రంగా ఒత్తిడి తీసుకు వస్తున్నట్లు తెలుస్తోంది. రోజూ కాసులు కురిపించే వ్యాపారం కావడంతో ఎలాగైనా మద్యం దుకాణాలు దక్కించుకునే పనిలో నిమగ్నమయ్యారు.

రూ.50 లక్షల నుంచి రూ.2.50 కోట్ల వరకు ...

ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే పలు మద్యం దుకాణాలు చేతులు మారాయి. ఒక్కో మద్యం దుకాణం డిమాండ్ మేరకు రూ.50 లక్షల నుంచి రూ.2.50 కోట్లకుపైగా ధర పలుకుతున్నాయి. నగర శివార్లలో రూ. 2కోట్లకుపైగా ధర పలుకుతున్న షాపుల సంఖ్య 100 వరకు ఉంటుందని అంచనా. జాతీయ, రాష్ట్ర రహదారులు, ముఖ్య కూడళ్లలో ఉండే మద్యం దుకాణాలకు రూ. కోటి నుంచి రూ.2కోట్ల వరకు గుడ్‌విల్ రూపంలో చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే మద్యం దుకాణాలకు రూ.50 లక్షల నుంచి రూ. కోటి వరకు గుడ్ విల్ పలుకుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. మద్యం దుకాణం కేటాయించిన ప్రాంతం, ప్రస్తుతం జరుగుతున్న వ్యాపారం ఆధారంగా గుడ్‌విల్ ఆఫర్ ఇస్తున్నట్లు తెలుస్తోంది. రూ.3 లక్షల పెట్టుబడితో నెల రోజుల్లోనే కోటీశ్వరులయ్యే అవకాశం దక్కడంతో పలువురు తమకు డ్రాలో దక్కిన మద్యం దుకాణాలను సిండికేట్ వ్యాపారులకు అప్పగించి గుడ్‌విల్ తీసుకునేందుకు బేరసారాలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కులకచర్ల మండల పరిధిలో డ్రాలో మద్యం దుకాణం దక్కించుకున్న ఓ వ్యక్తి రూ1.43 కోట్లకు ఇతరులకు విక్రయించడం చర్చనీయాంశంగా మారింది. డ్రాలో ఇది వరకే ఓ మద్యం దుకాణం దక్కించుకున్న వారే మరొక దుకాణాన్ని గుడ్‌విల్ ఇచ్చి దక్కించుకున్నట్లు తీసుకున్నట్లు సమాచారం.

నేడు ధారూరులో స్పీకర్ పర్యటన

ధారూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13న(గురువారం) శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్ తెలిపారు. తరిగోపులలో పిల్లల పార్క్, వాటర్‌ప్లాంట్, మురికాలువ, సిమెంట్ రోడ్డు ప్రారంభోత్సవం, రాజాపూర్‌లో బీటీ రోడ్డు, గడ్డమీది గంగారంలో బీటీ రోడ్డు, అవుసుపల్లిలో ఇందిరమ్మ ఇళ్లు, అంగన్‌వాడీ భవనం, అల్లీపూర్‌లో బీటీ రోడ్డు, గట్టేపల్లిలో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనం ప్రారంభోత్సవం, ధారూరులో అంగన్‌వాడీ, మార్కెట్ యార్డులో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని ఆయన చెప్పారు. అనంతరం సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ, మహిళా సమాఖ్య అధ్వర్యంలో పెరటి కోళ్ల పంపిణీ కార్యక్రమంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు.

పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలి

దోమ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను అందించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు అన్నారు. మండలంలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉద్యోగులకు మూడు, నాలుగు సంవత్సరాలుగా బెనిఫిట్స్ లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న బకాయిలను ప్రభుత్వం అందించాలని కోరారు. సభ్యత్వ నమోదులో మండల అధ్యక్షుడు వాసురాం, ప్రధనఅ కార్యదర్శి జంగయ్య, జిల్లా నాయకులు రమేశ్, మేమ్యు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలపై విజిలెన్స్ తనిఖీలు

తాండూర్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తాండూర్ మండలంలోని ఓగిపూర్ గ్రామానికి చెందిన ఎన్.గోవిందప్పకు సర్వే నంబర్ 141లో ఎకరా పట్టా భూమి ఉంది. అదే సర్వే నంబరులో బీజేపీ మాజీ ఎంపీ బద్దం బాల్‌రెడ్డికి చెందిన భూమిని తాండూర్‌కు చెందిన శెట్టి రమేశ్‌కు విక్రయించాడు. ఆయన నుంచి తాండూర్‌కు చెందిన గఫూర్‌పాష అనే వ్యక్తి భూమిని కొనుగోలు చేసి ఎలాంటి అనుమతులు లేకుండా అక్కడ తవ్వకాలు చేపడుతున్నాడు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చకుండా అక్రమంగా విద్యుత్ కనెక్షన్‌తో ఆ భూమిలో దౌర్జన్యంగా గఫూర్‌పాష తవ్వకాలు చేపడుతూ, పక్కనే ఉన్న తన ఎకరా భూమిలో దౌర్జన్యంగా తవ్వకాలు చేస్తున్నాడని రైతు గోవిందప్ప తాండూర్ రెవెన్యూ, మైన్స్ శాఖ అధికారులతో పాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో ఆయన లోకాయుక్తను ఆశ్రయించాడు. గోవిందప్ప ఆరోగ్యం బాగాలేక ఇబ్బందుల్లో ఉన్నా ఈ నెల 7న విచారణకు హాజరయ్యారు. న్యాయమూర్తి ముందు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ గఫూర్ పాష అనే వ్యక్తి తన సొంత భూమిలో తవ్వకాలు చేపట్టాడని, అడ్డుపడితే తన అనుచరులతో బెదిరింపులకు గురి చేయడంతో లోకాయుక్తను ఆశ్రయించినట్లు తెలిపాడు. స్పందించిన న్యాయమూర్తి మైన్స్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులకు విచారణతో నివేదిక అందించాలని ఆదేశించారు. దీంతో అధికారులు ఓగిపూర్‌లోని రైతు గోవిందప్పకు చెందిన సర్వే నంబర్ 141 పట్టా భూమితోపాటు పక్కనే ఉన్న భూమిని పరిశీలించారు. ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకాలు జరిపినట్లు గుర్తించారు. పూర్తి నివేదికను లోకాయుక్త న్యాయమూర్తికి అందించనున్నట్లు వారు తెలిపారు.



తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు



మహిపాల్‌రెడ్డి స్మృతి వనంలో నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

మహిపాల్‌రెడ్డికి మాజీ మంత్రి నివాళి

తాండూరు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాజీ మంత్రి సబితారెడ్డి తండ్రి, జి.మహిపాల్‌రెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా తాండూరు మండలం కోటబాస్పల్లిలోని స్మృతి వనంలో బుధవారం ఆమె సోదరుడు నర్సింహారెడ్డి(బాబు), సోదరి సద్గుణరెడ్డితో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మహిపాల్ రెడ్డి తాండూరు మండలానికి అందించిన సేవలు మరువలేనివని గుర్తు చేశారు. అనంతరం స్మృతి వనం వద్ద గ్రామానికి చెందిన కొంత మందికి పండ్లను పంపిణీ చేశారు. సమీపంలోని ఎల్లమ్మను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సోదరుడు గోటుగ రాజేందర్‌రెడ్డి, పీఆర్టీయూ జిల్లా నాయకులు నాగప్ప, కిష్టప్ప, స్నేహితులు వెంకట్‌రాం రెడ్డి, వీవీ రెడ్డి, బీసీ సంఘం నాయకులు సయ్యద్ సుకూర్, కరన్‌కోట్ జగదీశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సౌకర్యార్థం అదనపు గదుల నిర్మాణం

మాడ్గుల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం అదనపు గదులను నిర్మిస్తుందని విద్యా మౌలిక వసతుల మేనేజింగ్ డైరెక్టర్ గణపతిరెడ్డి అన్నారు. మాడ్గులలోని ఉన్నత పాఠశాలతో పాటు ప్రాథమిక పాఠశాలలో అదనపు గదుల నిర్మాణ పనులను బుధవారం చీఫ్ ఇంజనీర్ సఫిమియా, ఈఈ రామ్‌కుమార్, డీఈ కల్మానుద్దీన్‌లతో కలిసి సమీక్షించారు. ఉన్నత పాఠశాలలో రూ.3 కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టామని, కిచెన్ షెడ్, స్కూల్ ఆర్చి, కాంపౌండ్‌వాల్ మొదలగు అభివృద్ధి పనులను చేపట్టామని తెలిపారు. పనులు సక్రమంగా, వేగంగా చేయాలని ఏఈ శ్రీనివాస్‌ను ఆదేశించారు. అలాగే మాడ్గుల ప్రాథమిక పాఠశాలలో మూగ,చెవిటి విద్యార్థుల కొరకు అదనపు గది నిర్మాణం చేపట్టాలని ఎంఈవో సర్దార్ నాయక్ కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం సుదర్శన్, టీచర్లు, సాయిరెడ్డి, నర్సింహారెడ్డి, మసున విష్ణుపాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న గణపతిరెడ్డి

రెచ్చిపోయిన 'రియల్' వ్యాపారులు

ఏకంగా బస్టాండ్ కూల్చివేత.. ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో ఘటన

చర్యలు తీసుకోవాలని కాలనీవాసుల డిమాండ్

ఘట్‌కేసర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారులు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌ఎఫ్‌సీ నగర్‌లో జరిగిన ఘటనే ఇందుకు నిదర్శనం. కాలనీలోని పురాతన బస్టాండ్‌పై కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను పడింది. బుధవారం ఏకంగా బస్టాండ్‌ను కూల్చేసి చదును చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. 151 ఎకరాల సువిశాలమైన ఎన్‌ఎఫ్‌సీనగర్ కాలనీలో జనావసరాలకు అనుగుణంగా అప్పట్లో 80 అడుగుల రోడ్డులో అక్కడక్కడా బస్టాండ్‌లను నిర్మించారు. వర్షం కురిస్తే ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చాలాచోట్ల రేకులతో షెడ్లు నిర్మించారు. కొన్ని చోట్ల సిమెంట్ కట్టడాలతో వదిలేశారు. అయితే కాలనీలోని బస్టాప్ వెనుక ఉన్న ప్లాటును చదునుచేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాటుకు ఎదురుగా బస్టాండ్ ఎందుకు అనుకున్నారో ఏమో ఎక్స్‌కావేటర్‌తో నేలమట్టం చేశారు. అందులో ఉండే గ్రానైట్ రాళ్లను సైతం మాయం చేయడం గమనార్హం. ఇది గమనించిన స్థానికులు ఇదేంటని నిలదీశారు. 30సంవత్సరాల నుంచి ఉన్న బస్టాప్‌ను ఎలా కూల్చివేస్తారని తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. విషయాన్ని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకుపోయినట్లు కాలనీవాసులు తెలిపారు. కూల్చివేసిన బస్టాప్‌ను తిరిగి నిర్మించకపోతే తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో కూల్చివేసిన బస్టాప్

అయ్యో.. అపర్ణ

» కుటుంబసభ్యుల మృతితో దయనీయ పరిస్థితి

» ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు

కులకచర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కులకచర్లలో 12రోజుల క్రితం అనుమానంతో భార్య, ఆమె అక్కను, చిన్న కూతురును దారుణంగా హత్య చేసి అతను కూడా ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో గాయాలతో బయటపడిన పెద్ద కూతురు అపర్ణ పరిస్థితి దయనీయంగా మారింది. ప్రస్తుతం ఆమె పాలమూర్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. కుడి చేయికి గాయాలు కావడంతో వైద్యులు ఆమెకు శస్త్ర చికిత్స చేశారు. అదేవిధంగా గొంతునొప్పితో బాధపడుతోంది. ప్రస్తుతం అమ్మమ్మ పడిగ్యాల సాయమ్మ ఆమెకు ఆస్పత్రిలో తోడుగా ఉంది. తల్లిదండ్రులు, చెల్లి, ఆదరించే పెద్దమ్మ అందరూ మృతిచెందడంతో దిక్కుతోచని స్థితిలో ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తోంది.



పాలమూర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అపర్ణ

ఎంపీడీవో సృజన సాహిత్యకు సన్మానం

మోమిన్‌పేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల నూతన ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన సృజన సాహిత్యను బుధవారం ఏపీవో శంకరయ్య, ఉపాధిహామీ టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సోమారపు శ్రీనివాస్, అడివి రెడ్డి, పోచయ్య, హనుమంతు, చంద్రశేఖర్, నాగేందర్, జగన్నాథం, బుచ్చయ్య, దేవిదాస్, అశోక్, చందర్, లక్ష్మణ్, మల్లేశం, నర్సిములు, యంపీవో యాదగిరి, భగవాన్, ఎల్లయ్య, గంగయ్య, వెంకటేశ్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగంలో ఉజ్వల భవిష్యత్తు


విద్యార్థులకు జ్ఞాపికను అందజేస్తున్న ప్రిన్సిపాల్

కీసర రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ల్యాండ్ మార్క్ కన్వెన్షన్‌లో మంగళవారం రాత్రి రెజెన్స్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల యాజమాన్యం రెగ్ మెట్స్-2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. బెస్ట్ స్మైల్‌లో లక్ష్మీనరసింహ శ్రీనివాస, బెస్ట్ అట్టైర్‌గా హిమబిందు, బెస్ట్ హెయిర్ స్టైల్‌లో నందిని, నాటియెస్ట్‌లో తనుష్‌రాజ్, మిస్టర్, మిస్ ఫ్రెస్ అవార్డులను వంశీ, మేఘన, అశిల్, ప్రత్యేష, సిద్ధార్థ, ఈక్షితలు గెలుపొందారు. వారందరికీ ప్రోత్సాహక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ హాస్పిటాలిటీ రంగంలో ఉన్న వారికి భవిష్యత్తులో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బోధనా సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలకు పదునుపెట్టాలి


అనురాగ్ యూనివర్సిటీలో నిర్వహించిన గెస్ట్ లెక్చర్‌లో అధ్యాపకులు, విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో విద్యార్థులు వినూత్న ఆలోచనలకు పదును పెట్టాలని ఆరూప్ యూనైటెడ్ కింగ్ డమ్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ స్టీఫెన్ హెండ్రీ అన్నారు. పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో బుధవారం ఇంజనీరింగు అండ్ ఎనేబ్లింగ్ ఇంజనీరింగ్ అంతర్జాతీయ గెస్ట్‌లెక్చర్ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సివిల్ ఇంజనీరింగ్‌లో ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాలు, సస్టైనబుల్ పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇంజనీరింగు విద్యలో మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా విద్యాబోధన జరగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పల్లవి, విజయకుమార్, రవి బద్రి, ప్రదీప్ కుమార్, చందన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కళాజాతబృందం

పూడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ముందస్తు జాగ్రత్తలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. మండలంలోని కడుమూరు ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఆరోగ్యాన్ని ఏ విధంగా కాపాడుకోవాలనే అంశంపై విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆశ్రమ ఆకృతి, క్వాల్కమ్ కళాబృందం, కల్చరల్ మీడియా ఆధ్వర్యంలో కళాబృందం సభ్యులు ఆటపాటలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలల హెచ్ఎంలు రాజు, మధు, ఉపాధ్యాయులు హరీశ్, సువానయ్య, కళాబృందం లింగస్వామి, ఎం.శంకర్, ఈ.బాబు, ఎం.అశోక్, నరేందర్ పాల్గొన్నారు.

బ్రిడ్జిపై మరమ్మతులు


తాండూరు కాగ్నా వంతెనపై మరమ్మతులు

తాండూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తాండూరు-కొడంగల్ రోడ్డు మార్గంలోని కాగ్నానది వంతెనపై పడిన భారీ రంధ్రం పడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జూలైలో ఆర్అండ్‌బీ నేషనల్ హైవే అధికారులు గుంతను సిమెంట్‌తో పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేపట్టి వాహనాలు రాకపోకలు లేకుండా బారికేట్లు ఏర్పాటు చేసి జాప్యం వహించారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో బుధవారం భారీ కేడ్లను తొలగించి ఎట్టకేలకు బీటీ వేశారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కులకచర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి గురువారం కులకచర్లలో పర్యటిస్తారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహా పడిపూజ


వికారాబాద్: అయ్యప్ప మహా పడిపూజలో స్వాములు

వికారాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పరిధిలోని మద్గుల్ చిట్టంపల్లి గ్రామంలో కన్యస్వామి గోపాల్‌స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడి పూజను కనుల పండువగా నిర్వహించారు. రవిపంతులు ఆధ్వర్యంలో నిర్వహించిన భజన కార్యక్రమ పాటలకు అయ్యప్ప స్వాములు పేటతుల్లి ఆడారు. దీంతో గ్రామం మొత్తం అయ్యప్ప నామస్మరణతో మారుమోగింది. ఈ పూజలో స్థానిక మాజీ కౌన్సిలర్ గోపాల్, గ్రామ పెద్దలు పాండు, మల్లేశంతో పాటు గురుస్వాములు శ్రీనివాస్, బాలు, సన్నిధానం స్వాములు భీమయ్య, మహేష్, బాలకృష్ణ, మధు, అనిల్, రఘు తదితరులు పాల్గొన్నారు.

కీసర: హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామి 18వ మహాపడి పూజ కీసరలో ఘనంగా జరిగింది. ప్రదీప్ కుమార్ తంత్రీ ఆధ్వర్యంలో బుధవారం కీసరలో మాజీ ఉపసర్పంచ్ తటాకం లక్ష్మణ్‌శర్మ 18వ మహా పడిపూజ


కీసర: అయ్యప్ప మహా పడిపూజలో తటాకం లక్ష్మణ్‌శర్మ

నిర్వహించారు. ఈ సందర్భంగా మాలధారణ చేసిన అయ్యప్పలు, సామాన్య భక్తులు అధిక సంఖ్యల్లో విచ్చేసి పడిపూజలో పాల్గొన్నారు. లింగం గురుస్వామి ఆలపించిన భక్తి పాటలతో కీసర అయ్యప్ప నామస్మరణతో మారుమోగింది.

మా అన్న.. ఎప్పుడొస్తడు?

(ఐదో పేజీ తరువాయి)

ముందుండే వారు. తోటి విద్యార్థులతో కలిసి ఎప్పుడూ హుషారుగా గడిపేవారు. వంశీ విద్యుత్ షాక్‌కు గురి కావడం పాఠశాల ఉపాధ్యాయులను, విద్యార్థులను తీవ్రంగా కలిచివేసింది. విద్యుత్ షాక్‌తో వంశీ చేతులు కొంత భాగం కాలిపోయాయి. గోడపై నుంచి కింద పడడంతో కాళ్లకు, తల, ముక్కుకు రక్త గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ వంశీ చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లి అతడి ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

కంచె లేకపోవడంతోనే..

అనంతరం ఘటన చోటు చేసుకున్న గంగారం ప్రాథమిక పాఠశాల వద్దకు వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న స్థలాన్ని పరిశీలించారు. చుట్టూ కంచె లేకపోవడాన్ని గుర్తించి సంబంధిత అధికారిని ప్రశ్నించారు. విద్యార్థులు రాకపోకలు కొనసాగించే మార్గంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఎలాంటి కంచె లేకపోవడం పట్ల వారు విస్మయం వ్యక్తం చేశారు. ఘటన చోటు చేసుకున్న తీరును తెలుసుకునేందుకు పాఠశాల విద్యార్థులు, హెచ్ఎంతో వారు మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సమయంలో అక్కడికి వచ్చిన వంశీ చెల్లెలు అశ్విని తన అన్న కోసం కన్నీటి పర్యంతమైంది. అన్న ఎట్లున్నాడు.. ఎప్పుడొస్తాడంటూ రోదిస్తున్న ఆమెను ఊరడించడం కష్టసాధ్యమైంది. ఏమీ కాదని ఊరడించినా ఆ పాప రోదిస్తున్న తీరు చూసి అక్కడున్న వారిని కలిచివేసింది.

ఆర్థిక సాయం అందించిన ఉపాధ్యాయులు

మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నీలోఫర్ ఆసుపత్రికి తరలించిన వంశీ వెంట వెళ్లిన వారికి పాఠశాల ఉపాధ్యాయులు ఆర్థిక సాయం అందించారు. రెక్కాడితే గానీ డొక్కాడని పేదరికం అనుభవిస్తున్న వంశీ కుటుంబానికి కొంత నగదు అందజేసి అండగా నిలిచారు. ఆసుపత్రికి వెళ్లిన వారికి చేతి ఖర్చుల కోసం వారు రూ.10వేల వరకు సమకూర్చారు.

70గ్రామాల్లో సర్వేకు ఓకే

(ఐదో పేజీ తరువాయి)

భాగంగా భూములన్నింటిని రీ సర్వే చేసి భూధార్ నంబరును కేటాయించేందుకు ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే.

క్యూఆర్ కోడ్ ద్వారా వివరాలు..

ఇందుకోసం లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి ఇప్పటికే సిద్ధం చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద మేడ్చల్, రాజబొల్లారం గ్రామాలను ఎంపిక చేసి రీ సర్వే నిర్వహిస్తున్నారు. రైతుల భూముల ఎంజాయ్‌మెంట్(అనుభవిస్తున్న) సర్వే నిర్వహించి రైతులకు భూధార్ నంబర్లను అధికారులు కేటాయిస్తారు. ఆన్‌లైన్‌లో పొందుపరిచిన వివరాలను క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా తెలుసుకోవచ్చు. సర్వే పూర్తి చేసి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిస్తే భూధార్ నంబర్ జనరేట్ అవుతుంది.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే..

జిల్లాలో మేడ్చల్, శామీర్‌పేట, కీసర, ఘట్‌కేసర్, కుత్బుల్లాపూర్ మండలాల్లోని మేజర్ రెవెన్యూ గ్రామాలను అధికారులు ఎంపిక చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ఆయా గ్రామాల్లో అధికారులు సర్వే చేసేందుకు సిద్ధమౌతున్నారు. ఇందుకోసం మండలానికి ఇద్దరు లైసెన్స్‌డే సర్వేయర్లను నియమించాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకున్న లైసెన్స్‌డ్ సర్వేయర్లకు దీనిపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

అండర్ పాస్ నిర్మాణానికి స్థల పరిశీలన


అండర్ పాస్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న నేషనల్ హైవే ఇంజనీర్

ఘట్‌కేసర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లోని మైసమ్మగుట్ట కాలనీకి వెళ్లేందుకు జాతీయ రహదారిని దాటేందుకు (వీయూపీ) నిర్మాణ పనులకు నేషనల్ హైవే అధికారులు బుధవారం మరోసారి స్థలాన్ని పరిశీలించారు. గతంలో ఇక్కడ వీయూపీ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారు. ఉన్నట్టుండి అండర్‌పాస్‌ను రద్దుచేశారనే ప్రచారం జరిగింది. దీంతో స్థానికులు స్థానిక ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి సమస్యను వివరించారు. స్పందించిన ఎంపీ గతంలో రూపొందించిన విధంగానే అండర్‌పాస్ నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించాడు. దీంతో బుధవారం జాతీయ రహదారుల శాఖ ఇంజనీర్ లక్ష్మీనాయుడు స్థలపరిశీలన చేశారు. ఈసందర్భంగా స్థానిక నాయకులు సమస్యలను వివరించారు. మైసమ్మగుట్ట కాలనీతోపాటు ప్రభుత్వ హాస్టళ్లు, కళాశాల ఉన్నందున నిత్యం పెద్దసంఖ్యలో విద్యార్థులు, ప్రజలు రోడ్డు దాటడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. తక్షణమే అండర్‌పాస్ నిర్మాణ పనులను చేపటాల్టని స్థానిక నాయకులు కోరారు.

నిబంధనలు పాటించినా బిల్లు ఇవ్వరా?


ఎమ్మెల్యే కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న పుష్పలత

బషీరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇంటి బేస్మెంట్ నిర్మించుకుంటున్నా లబ్ధిదారురాలికి బిల్లు ఇవ్వారంటూ శ్రీచండీ ముదిరాజ్ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కోట్ల పుష్పలత అన్నారు. తాండూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి బుధవారం లబ్ధిదారురాలి కుటుంబంతో కలిసి ఆమె ఇక్కడికి వచ్చారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో అక్కడున్న సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. అనంతరం పుష్పలత మట్లాడుతూ బషీరాబాద్ మండలం మల్కన్‌గిరి గ్రామానికి చెందిన తలారి శాణమ్మకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా అందరికీ బెస్మెంట్ బిల్లులు వచ్చినా శాణమ్మకు మాత్రం బిల్లు రాలేదన్నారు.లబ్దిదారురాలకి గుండే ఆపరేషన్ జరిగిందని, బిల్లు చెల్లింపులో అధికారులు జాప్యం జరుగకుండా చూడాలన్నారు. నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇంటి బేస్మెంట్ నిర్మించుకున్న వారికి తాత్సరం చేయకుండా సకాలంలో బిల్లులు వచ్చేలా అధికారులు చూడాలన్నారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని లబ్ధిదారురాలికి బిల్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆమెవెంట ముదిరాజ్ సంఘ నాయకులు హన్మయ్య, రమేశ్, శ్రీనివాస్, కృష్ణయ్య, శ్రీనివాస్ తదితరులున్నారు.

మొక్కజొన్న కొనుగోలులో జాప్యం తగదు


మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు

కులకచర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న కొనుగోలులో జాప్యం చేయరాదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. కులకచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. సౌకర్యాలు, సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచే అధికారులతో మాట్లాడారు. మొక్క జొన్న కొనుగోలుకు గన్నీ బ్యాగుల ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని సూచించారు.

తహసీల్దార్ మనోహరచక్రవర్తికి సన్మానం


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న అయ్యప్పస్వాములు

కులకచర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వాములకు సేవచేయడం అదృష్టంగా భావిస్తున్నానని కులకచర్ల తహసీల్దార్ మనోహరచక్రవర్తి అన్నారు. స్థానిక అయ్యప్పకొండపై బుధవారం స్వాములకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వాములు తహసీల్దార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఖాజ, సురేశ్‌రెడ్డి, గురుస్వాములు ఈశ్వరయ్య, చంద్రశేఖర్, అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

లో వోల్టేజీ సమస్యకు పరిష్కారం

దుద్యాల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హస్నాబాద్‌లోని తెలుగు వీధిలో విద్యుత్ లో వోల్టేజీ సమస్యను పరిష్కరించినట్లు లైన్‌మెన్ వెంకట్రాములు తెలిపారు. కాలనీలో నెల రోజుల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం ప్రారంభించారు

పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరి

ఘట్‌కేసర్, నవంబరు12(ఆంధ్రజ్యోతి):పశువుల పెంపకం దారులు విధిగా తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని ఘట్‌కేసర్ పశువైద్యాధికారి పద్మిని కోరారు. ఘట్‌కేసర్‌లో బుధవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఘట్‌కేసర్‌లో 30ఆవులకు, 142బర్రెలకు మొత్తం 172 పశువులకు టీకాలు వేశామన్నారు. ఈనెల 15తో ఈ కార్యక్రమం ముగుస్తుందన్నారు.

బోర్లను కాపాడాలి

మేడ్చల్ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లంపేట మున్సిపాలిటీ రావల్‌కోల్‌లో ప్రభుత్వబోర్లను కొందరు స్థానిక నాయకులు తమసొంత అవసరాలకోసం వాడుకుంటున్నారంటూ గ్రామస్థులు మున్సిపల్ కమిషనర్ స్వామినాయక్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామప్రజల దాహార్తి తీర్చడానికి గ్రామ పంచాయతీ తరఫున గ్రామపరిధిలోని ఆయా వార్డుల్లో పెద్ద ఎత్తున నిధులు వెచ్చించి వేయించిన బోర్లు ప్రస్తుతం ఓ నేత తన సొంత ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని గ్రామస్థులు ఆరోపించారు.

పాఠశాలకు టీవీ బహూకరణ



బ్రహ్మణపల్లి పెద్దతండా పాఠశాలలో టీవీని అందజేస్తున్న ఆర్ఐ రవి

దోమ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మణపల్లి పెద్ద తండా పాఠశాలలో తండావాసి రవి (ఆర్ఐ) బుధవారం టీవీని బహూకరించారు. ఈ సందర్భంగా ఆయనను ఎంఈవో వెంకట్ సన్మానించి అభినందించారు. తాను ఇదే పాఠశాలలో విద్యనభ్యసించానన్నారు. హెచ్ఎం ప్రధానోపాధ్యాయుడు లాల్యానాయక్, గోపాల్, బుజ్జిబాయి, రూప్లానాయక్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి


సాంబారును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్

కొడంగల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని మున్సిపల్ కమిషనర్ బల్‌రాంనాయక్ సూచించారు. స్థానిక జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనం అందించారు. భోజనం నాణ్యతపై విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. వంటగది, కూరగాయలు, బియ్యం పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

సీనియర్ అసిస్టెంట్‌కు ఉద్యోగోన్నతి

కొడంగల్ రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కొడంగల్ ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బాలకృష్ణారెడ్డి ఉద్యోగోన్నతి పొందారు. కొడంగల్ ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. దీంతో బుధవారం ఆయనను ఎంపీడీవో ఉష్రశ్రీ, ఎంపీవో జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పూలమాలవేసి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో తాలూకా అధ్యక్షుడు కొండన్న, పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాసంస్థలను కొడంగల్‌లోనే ఏర్పాటు చేయాలి

కొడంగల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాల ఏర్పాటుకు శంకుస్థాపన చేసిన ప్రాంతాల్లోనే ఏర్పాటు చేయాలని కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు అన్నారు. కొడంగల్‌లోని బుల్కాపూర్, ఐనన్‌పల్లి, ప్యాలమద్ది గ్రామాల్లో బుధవారం 'కొడంగల్ అభివృద్ధికి తరలిరండి' వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు సురేశ్, ఎస్ఎం.గౌసన్, మాసాని వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శిక్షణ కార్యక్రమాలు

తాండూరు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో మహిళలకు అక్షరాస్యత పెంపొందించేందుకు ఉల్లాస్ యోజన పథకం కింద రెండు రోజులుగా శిక్షణ కొనసాగుతుందని ఏపీయం బాలయ్య పేర్కొన్నారు. మహిళా సమాఖ్య కార్యాలయంలో వీవోఏలకు ప్రతీ మహిళ చదవడం, రాయడం నేర్చుకోవాలని శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళ సమాఖ్య అధ్యక్షురాలు భాగ్యలక్ష్మీ, కార్యదర్శి నాగమ్మ, సీసీలు సత్యనారాయణ, సయ్యద్, శంకర్, ప్రభు, బందెప్ప ఉన్నారు.

క్రైం కార్నర్

అదృశ్యమైన వృద్ధుడి అస్థిపంజరం లభ్యం


పొలంలో లభ్యమైన అస్థిపంజరం

మర్పల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన వృద్ధుడి అస్థిపంజరం లభ్యమైన ఘటన మండలంలోని బూచన్‌పల్లిలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు బూచన్‌పల్లి గ్రామానికి చెందిన చాపల లక్ష్మయ్య(80) గతనెల అక్టోబరు 21న ఇంట్లో నుంచి వెళ్లాడు. రోజూ మాదిరిగా బయటకు వెళ్లి ఇంటికి వస్తాడని భావించగా సాయంత్రమైనా రాకపోవడంతో ఆచూకీ కోసం వెతికారు. మరుసటి రోజు 22వ తేదీన మర్పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం బూచన్‌పల్లి గ్రామానికి చెందిన సర్వే నంబర్ 88 పాపయ్య పొలంలో కంది పంటకు మందు


లక్ష్మయ్య (ఫైల్)

పిచికారీ చేసేందుకు కొంతమంది వెళ్లారు. పొలంలో అస్థిపంజరం కనిపించిందని రైతులు గ్రామస్థులు, పోలీసులకు సమాచారం అందించారు. అస్థిపంజరం పక్కనే చెప్పులు, దుస్తులు గుర్తించి చాపల లక్ష్మయ్యగా గుర్తించారు. కాగా లక్ష్మయ్య మృతికి గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గేదెను తప్పించబోయి కిందపడి తీవ్రగాయాలైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన పోచారం ఐటీకారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోచారం మున్సిపాలిటీ, కొర్రెముల, ఎస్వీ గ్రీన్‌ల్యాండ్ అపార్టుమెంట్‌లో ఆడేపు శ్రీనిధి(32) భార్య, కూతురుతో ఉంటూ బంజారాహిల్స్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 8వ తేదీన శ్రీనిధి భార్య సుభాషిణి తన కూతురు దిత్యమహితితో కలిసి వరంగల్‌కు వెళ్లారు. అదేరోజు ఉదయం శ్రీనిధి ఉద్యోగరీత్యా బంజారాహిల్స్ వెళ్లి సాయంత్రం బైక్‌పై ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో మక్తా సమీపంలో అడ్డుగా వచ్చిన గేదెలను తప్పించబోయి కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. దీంతో అతన్ని చికిత్స నిమిత్తం మేడిపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం పంజాగుట్టలోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా శ్రీనిధి చికిత్సపొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వేర్వేరు చోట్ల సైబర్‌మోసాలు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వేర్వేరు చోట్ల సైబర్ మోసాలు జరిగాయి. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సూర్యపేట్, రావులపల్లికి చెందిన నింషీ శరణ్(28) పోచారం మున్సిపాలిటీ, పాత విలేజ్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. ఈనెల 4వ తేదీన గుర్తుతెలియని వ్యక్తి కొత్తనంబర్ 8478870036 నుంచి ఫోన్‌చేసి ఆక్సిస్ బ్యాంక్ నుంచి ఇన్సూరెన్స్ వచ్చిందని చెప్పాడు. నింషీ శరణ్ ఫోన్‌కు లింక్ పంపించి 'మై ఆక్సిస్ ఇన్సూరెన్స్'లో లాగిన్ కావాలని చెప్పాడు. వెబ్‌సైట్‌లో ఫోన్‌నంబర్ ఎంటర్ చేయగా వచ్చిన ఓటీపీని నింషీ సదరు వ్యక్తికి చెప్పాడు. దీంతో బ్యాంక్ ఖాతా నుంచి పలుమార్లు మొత్తం రూ.1,34,389లు డెబిట్ అయ్యాయి. తిరిగి అదే ఫోన్ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో మోసపోయినట్లు గ్రహించి బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మరో సైబర్ మోసం పోచారం మున్సిపాలిటీ, నవదుర్గ కాలనీలో జరిగింది. కాలనీకి చెందిన మాలోత్ రవి(28)కి ఈనెల 12వ తేదీన గుర్తుతెలియని వ్యక్తి 7509414952 నంబర్ నుంచి వాట్సాప్‌లో టెలిగ్రామ్ లింక్ పంపాడు. టెలిగ్రామ్ ఐడీ క్రియేట్ చేసుకుంటే పెద్దహోటల్స్‌లో రేటింగ్ ఇస్తామని చెప్పాడని తెలిపారు. ఐడీ క్రియేట్ అయ్యిందని డబ్బులు చెల్లిస్తే మీ డబ్బులు రెండింతలు అవుతాయని రవికి చెప్పాడు. దీంతో అతడి మాటలు నమ్మిన రవి పలుమార్లు రూ.1,09,000లను పంపాడు. తర్వాత అతడికి చాలాసార్లు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో తాను మోసపోయానని గ్రహించి పోచారం ఐటీ కారిడార్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

హుండీ చోరీ నిందితుల రిమాండ్

పెద్దేముల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ పగలగొట్టి డబ్బులు చోరీచేసిన నిందితులను పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ వేణు కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 6వ తేదీన చోరీ జరిగిన విషయం తెలిసిందే. పెద్దేముల్ గ్రామానికి చెందిన గౌడి శివకుమార్, బంట్వారం మండలం సల్బత్తాపూర్ గ్రామానికి చెందిన సమకొల్ల నాగరాజులు జల్సాలకు అలవాటుపడ్డారు. వీరు చేసే కూలీ డబ్బులు జల్సాలకు సరిపోవడం లేదు. దీంతో ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ చోరీకి పథకం పన్నారు. స్క్రూడ్రైవర్‌తో హుండీ కింది భాగాన్ని తొలగించి అందులో ఉన్న సుమారు రూ.7,600ల నగదును దొంగిలించారు. అదేవిధంగా గౌడి శివ ఒక్కడే ఎంఆర్సీ భవనంలో లాప్‌టాప్ చోరీచేశాడు. వీరిద్దరూ పెద్దేముల్ వైన్స్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి నగదు రూ.8,100లు స్వాధీనం చేసుకున్నారు. కోర్టు ఆదేశాల మేరకు వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వేణు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు

పరిగి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చోరీ చేసిన నిందితుడికి నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ పరిగి మున్సిఫ్‌కోర్టు న్యాయాధికారిణి నాగుల శిల్ప తీర్పునిచ్చారు. పరిగి మండలం రాఘవాపూర్‌లో బోయిని రాములు టిఫిన్ సెంటర్‌లో గత ఆగస్టు 5వ తేదీన రూ.11వేలు దొంగతనం జరిగింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన పోలీసులు విచారణలో దోమ మండలం బొంపల్లితండాకు చెందిన నేనావత్ గణేశ్‌గా గుర్తించి రిమాండ్‌కు తరలించారు. న్యాయస్థానంలో కేసుకు సంబంధించి పూర్వాపరాలు పరిశీలించిన న్యాయాధికారిణి బుధవారం తీర్పునిచ్చారు. ఈ తీర్పులో నిందితుడికి తొమ్మిది నెలల జైలుశిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించినట్లు పరిగి ఎస్ఐ మోహనకృష్ణ తెలిపారు.

అక్రమంగా ఇసుక డంపింగ్


పొలాలకు వెళ్లే దారిలో డంపింగ్ చేసిన ఇసుక

వికారాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఒక వైపు జిల్లా అధికార యంత్రాంగం ఇసుక కట్టడికి చర్యలు తీసుకుంటుంటే మరోవైపు ఇసుక మాఫియా ఆగడాలు మాత్రం ఆగడం లేదు. అక్రమంగా ఇసుక డంపింగ్‌లు చేస్తూ రాత్రుల్లో ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోనే ఈ తతంగం అంతా నడుస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వస్తున్నారు. కొత్రేపల్లి శివారులో పొలాల వైపు వెళ్లే దారిలో ఇసుక డంపింగ్ చేస్తూ రాత్రుల్లో తరలిస్తున్నట్లుగా తెలుస్తోంది. అధికారులు అక్రమ ఇసుకపై నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.